క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



సాక్షి ఎఫెక్ట్

తిరువూరు: రబీ ధాన్యం కొనుగోలులో తిరువూరు మండలం వావిలాల పీఏసీఎస్ సిబ్బంది నిర్లక్ష్య ధోరణిపై 'సాక్షి'లో వచ్చిన కథనానికి పౌరసరఫరాల జిల్లా మేనేజరు సతీష్ స్పందించారు. శనివారం వావిలాల పీఏసీఎస్‌ను తిరువూరు ఆర్డీఓ మాధురితో కలిసి సందర్శించారు. సొసైటీలో ఇంతవరకు కొనుగోలు చేసిన ధాన్యం, రైతులకు చెల్లింపులు, ధాన్యం సంచుల సరఫరా, లారీలు ఏర్పాటు చేసి మిల్లర్లకు తరలించిన ధాన్యం వివరాలను తనిఖీ చేశారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని, రైతుల వద్దకే సిబ్బంది వెళ్లి ధాన్యం సేకరించాలని ఆదేశించారు.

పౌష్టికాహారం తప్పనిసరి

నూజివీడు: తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయం ఆవరణలో సీడీపీఓ కె. ధనలక్ష్మి అధ్యక్షతన శనివారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఆర్. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ శ్మశాన వాటిక పరిశీలన

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడు గ్రామంలోని ఎస్సీ శ్మశాన వాటిక అభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టారు. మండల పరిషత్ ఏఈ సాంబశివరావు శ్మశాన వాటికలో అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలను శనివారం పరిశీలించారు. మూలపాడు ఉబ్బడి వాగు పక్కన ఉన్న శ్మశానంలో ఎస్సీల సమాధి కార్యక్రమాలకు వర్షాకాలంలో వాగు పొంగి సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో డీసీసీ కార్యదర్శి చింతపల్లి దాస్ సమస్యను ఎన్టీటీపీఎస్, మండల పరిషత్, తహసీల్దార్, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో పలుమార్లు వినతిపత్రం అందజేశారు. ఎట్టకేలకు స్పందించిన జిల్లా కలెక్టర్ లక్ష్మీశ శ్మశాన వాటిక అభివృద్ధికి ఎస్టిమేషన్ తయారు చేయాలని ఎంపీడీఓ సునీతశర్మను ఆదేశించారు.

శిశు ఆధార్ కేంద్రం ప్రారంభం

నూజివీడు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో శనివారం ఉచిత శిశు ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. నరేంద్రసింగ్ ప్రారంభించారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ, కామన్ సర్వీస్ సెంటర్ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై డెమో

నూజివీడు: ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేసే ఉద్యోగులందరూ ప్రాథమికంగా అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనే మెలకువలపై అవగాహన కలిగి ఉండాలని ఫైర్ ఆఫీసర్ డి. మత్తయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లోని సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఆస్పత్రుల్లో ఎక్కువగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఫైర్ సిబ్బంది, ఫీడ్స్ పరిశ్రమలో పనిచేసే ఉద్యోగులు పాల్గొన్నారు.

825 లీటర్ల సారా స్వాధీనం

నూజివీడు: నవోదయం 2.0లో భాగంగా ఇప్పటివరకు నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో 56 కేసులు నమోదు చేసి 78 మంది నిందితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు 825 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎ. మస్తానయ్య తెలిపారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ 13,950 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని, 4 వాహనాలను, 139 కిలోల బెల్లంను, 20 కిలోల అమ్మోనియా, 3 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా తయారీదారులకు బెల్లంను సరఫరా చేసిన ఏడుగురు వ్యాపారులపై కేసులు నమోదు చేశామని చెప్పారు.

నామినేటెడ్ పోస్టుల్లో రజకులకు అన్యాయం

మైలవరం: నామినేటెడ్ పోస్టుల్లో రజక సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పించకపోవడం బాధాకరమని రజక సంఘం మైలవరం నియోజకవర్గ అధ్యక్షుడు తాళ్లూరి శేషగిరిరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైలవరం నియోజకవర్గంలో ఏఎంసీ, ప్రభుత్వ ఆస్పత్రి, ప్రభుత్వ సహకార బ్యాంకుల్లో చైర్మన్‌లు, డైరెక్టర్‌లుగా రజక వర్గాన్ని గుర్తించకపోవడం సరి కాదన్నారు.

బీమా పరిహారం అందజేత

నూజివీడు: పోతురెడ్డిపల్లి సొసైటీ సభ్యులైన తాళం భాస్కరరావు ఇటీవల మరణించగా ఆయన భార్య తాళం జగదీశ్వరికి శనివారం బీమా పరిహారం రూ.3.10 లక్షలను అందజేశారు. సంఘ మాజీ అధ్యక్షుడు కొమ్మన నాగేశ్వరరావు, అక్కినేని బెనర్జీ, మాజీ సర్పంచి అక్కినేని చందు చేతుల మీదుగా నగదును అందజేశారు. కేడీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్ అక్కినేని ఆంజనేయ ప్రసాద్, సొసైటీ సీఈఓ అక్కినేని శివప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ పద్మవ్యూహం

నూజివీడులో పెరుగుతున్న వాహనాలతో పాటు ట్రాఫిక్ సమస్య కూడా నానాటికి జఠిలంగా మారుతోంది. 60 ఏళ్ల నాడు ఆనాటి అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన ఇరుకు రోడ్లే నేటికీ దిక్కుగా ఉండటం, రహదారుల విస్తరణపై దృష్టి సారించకపోవడంతో ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి.

- రహదారులే పార్కింగ్ స్థలాలు
- పట్టించుకోని పోలీసులు
- నూజివీడు పట్టణంలో ప్రజల ఇబ్బందులు



నూజివీడులో బ్యాంకు వద్ద రోడ్డు మార్జిన్‌లో పార్కు చేసిన బైక్‌లు

నూజివీడు: పట్టణంలో విజయవాడ, విస్సన్నపేట, మైలవరం, హనుమాన్ జంక్షన్ రోడ్లతో పాటు పెద్ద గాంధీ బొమ్మ, చిన్న గాంధీ బొమ్మ, పొట్టిశ్రీరాములు బొమ్మ, మున్సిపల్ కార్యాలయం, సింగ్ హోటల్, తాతాయ్యబాబు ఆస్పత్రి, మైలవరం బస్టాపు, శివాలయం సెంటర్లలో నిత్యం ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. పట్టణం నుంచి బయటకు బస్సులు, కార్లలో ప్రయాణించాలంటే రద్దీ సమయంలో దాదాపు 20 నిమిషాల నుంచి అరగంట వరకు పడుతోంది. రోడ్డు వెంబడి ఆటోలు, తోపుడు బండ్లు, ఫ్రూట్స్ వ్యాపారులు, టిఫిన్ బండ్లు, ఫ్రైడ్ రైస్ బండ్లు, టీ స్టాళ్లు తదితర వాళ్లు రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు.

కనిపించని ట్రాఫిక్ సిబ్బంది

గతంలో ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ ఎస్ఐతో పాటు నలుగురు సిబ్బంది ఉండేవారు. అయితే గత 10 నెలలుగా పట్టణంలో ట్రాఫిక్ సిబ్బందే లేకుండా పోయారు. దీంతో ట్రాఫిక్ పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్నచందంగా తయారైంది.

అమలుకాని వన్‌వే నిబంధనలు

పట్టణంలో ఇరుకురోడ్లు కావడంతో 20 ఏళ్ల నుంచి వన్‌వే నిబంధనలను ఏర్పాటు చేశారు. గత ఏడాది కాలంగా వన్‌వే నిబంధనలు అమలు కావడం లేదు. మున్సిపల్ కార్యాలయం సెంటర్ నుంచి వెంకటేశ్వరస్వామి కోవెల రోడ్డు వన్‌వే కాగా అదేమీ ఈ రోడ్డులో అమలు కావడం లేదు. అలాగే పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ నుంచి పొట్టిశ్రీరాములు బొమ్మ సెంటర్ వైపునకు కూడా వాహనాలు రావడానికి లేదు. అయితే కార్లు, ఆటోలు, రవాణా వాహనాలు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నాయి.

నిత్యం ట్రాఫిక్ కష్టాలు..

దీంతో ఈ మార్గంలో కృష్ణా బడ్డీ సెంటర్, పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్, పండ్ల మార్కెట్ సెంటర్‌లలో నిత్యం ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో, హనుమాన్ జంక్షన్ రోడ్డులోని బస్టాపు సెంటర్ తదితర చోట్ల రోడ్లపైకి దుకాణాల వారు కౌంటర్లను ఏర్పాటు చేయడంతో షాపులకు వచ్చిన వారు తమ వాహనాలను రోడ్డుపైనే ఉంచుతుండటంతో రహదారులు మరింత ఇరుకుగా తయారై వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

బస్టాండు రోడ్డులో బిర్యానీ పాయింట్ల వద్ద సైతం పార్కింగ్ లేకుండా కౌంటర్లను రోడ్డు అంచుకు ఏర్పాటు చేయడంతో అక్కడకు వచ్చే వారంతా తమ ద్విచక్ర వాహనాలను, కార్లను రోడ్డుపైనే ఉంచేస్తుండటంతో ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. వీటన్నింటికి తోడు బ్యాంకుల వద్ద సైతం కార్లు, బైక్‌లను రోడ్డుపై పెడుతుండటంతో వాహనాలు తప్పుకోవడానికి వీలుండటం లేదు. రైతు బజారు రోడ్డులో రహదారిపైనే ఆటోలను నిలిపి ఉంచేస్తుండటంతో కూరగాయల కోసం వచ్చిన ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పార్కింగ్ లేకుండానే వ్యాపారాలు..



నూజివీడులోని రైతుబజారు రోడ్డులో నిలిపిన ఆటోలతో ట్రాఫిక్ కష్టాలు

ఇబ్బందులు లేకుండా చూడాలి



పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ కష్టాలు పెరుగుతున్నాయి. షాపింగ్‌కు వచ్చే వారు వారి వాహనాలను రోడ్లపైనే ఉంచుతుండటంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా మారుతోంది. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నిమ్మగడ్డ నరసింహ, సీపీఐ నాయకుడు, నూజివీడు

రోడ్లపైనే పార్కింగ్



పట్టణంలో రోడ్లపైనే కార్లను పార్కింగ్ చేయడం పరిపాటిగా మారింది. గంటల తరబడి రోడ్లపైనే ఉంచుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీనికి తోడు మార్జిన్లను ఆక్రమించి పలువురు వ్యాపారాలు చేస్తున్నారు. వీటిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– శిఖా ఆకాష్, నూజివీడు

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి హాని

సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్



ఈ కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభించిన సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

నూజివీడు: ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణంపైనే కాకుండా ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతాయని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల కలిగే దుష్ఫలితాలపై ర్యాలీ నిర్వహించడంతో పాటు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఈ వేస్ట్ కలెక్షన్ సెంటర్‌ను సబ్ కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చాలా మందికి ఈ వ్యర్థాలను ఏమి చేయాలో తెలియదని, అందువల్ల వాటిని ఎక్కడ పడితే అక్కడ పారేయడం వల్ల డంపింగ్ యార్డుల్లో ఈ వ్యర్థాలు పేరుకుపోతున్నాయన్నారు. రోజురోజుకు ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకం పెరుగుతున్నందున ఎలక్ట్రానిక్ వ్యర్థాలు కూడా పెరుగుతున్నాయన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సరిగా నిర్వహించకపోవడం వల్ల నేల, నీటి కాలుష్యం ఏర్పడుతోందని చెప్పారు. పట్టణంలో ఎవరి వద్దనైనా ఈ వేస్ట్ ఉంటే మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద అప్పగించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి గౌతు లచ్చన్న

మాజీ మంత్రి జోగి రమేష్



మైలవరంలో నివాళులర్పిస్తున్న జోగి రమేష్ తదితరులు

మైలవరం: బడుగు, బలహీన వర్గాల ఆర్థిక, సామాజిక హక్కుల కోసం పోరాడిన మహోన్నత నాయకుడు సర్దార్ గౌతు లచ్చన్న అని, ఆయన సేవలు ప్రశంసనీయమని మాజీ మంత్రి, వైఎస్సార్‌ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి కార్యక్రమం మైలవరం ఆర్ అండ్ బీ అతిథిగృహం వద్ద శనివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి జోగి రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. జోగి రమేష్ మాట్లాడుతూ లచ్చన్న సేవలను కొనియాడారు. నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పామర్తి శ్రీనివాసరావు, వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడు జి. వెంకట్రావు, పట్టణ అధ్యక్షుడు పాలా నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ చామల సీతా రామిరెడ్డి, బీసీ నాయకులు పాల్గొన్నారు.

అమరావతిలో గౌతులచ్చన్న విగ్రహం ఏర్పాటుచేయాలి

నూజివీడు: సర్దార్ గౌతు లచ్చన్న నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత అని గౌడ సంఘం నాయకులు మరీదు శివరామకృష్ణ అన్నారు. నియోజకవర్గ గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని బస్టాండ్ సెంటర్ వద్ద గౌతు లచ్చన్న వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు పులిహోర, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. శివరామకృష్ణ మాట్లాడుతూ విలువలతో కూడిన రాజకీయాలు నడిపిన లచ్చన్న విగ్రహాన్ని అమరావతిలో నెలకొల్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో చాట్రాయి, ముసునూరు, నూజివీడు టౌన్, రూరల్, ఆగిరిపల్లి మండల నాయకులు చల్లారి సాంబశివరావు, చింతగుంట్ల వెంకటేశ్వరరావు, తల్లాడ శ్రీనివాసరావు, చింతా శ్రీనివాసరావు, మరీదు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్ ర్యాలీలు

ఇబ్రహీంపట్నం: రన్ ఫర్ జీసస్ ర్యాలీ ఇబ్రహీంపట్నం పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో స్థానిక రింగ్ సెంటర్‌లో శనివారం నిర్వహించారు. ఫెలోషిప్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పాస్టర్ ఎలీషా మాట్లాడుతూ ఏసుక్రీస్తు మరణాన్ని జయించి మూడో రోజు సజీవుడిగా లేస్తారని, ఆ రోజు ఈస్టర్ పండుగ (పునరుద్ధాన దినోత్సవం) జరుపుకుంటామని చెప్పారు. క్రీస్తు చూపిన ప్రేమ, దయ, కరుణను తోటి వారిపై చూపిస్తూ ఆయన మార్గంలో నడవాలని చెప్పారు. పునరుద్ధాన దినోత్సవానికి గుర్తుగా రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించామని చెప్పారు. ర్యాలీలో మండల పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు డి. సుబ్బారావు, ఉపాధ్యక్షుడు ఎం. స్టీవెన్, కార్యదర్శి సీహెచ్ ఇస్సాకు, సహాయ కార్యదర్శి ఎస్. సాల్మన్, కోశాధికారి ఆర్. శుభాకరరావు, వందలాదిమంది క్రైస్తవులు పాల్గొన్నారు



జి.కొండూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు, క్రైస్తవులు

జి.కొండూరు: స్థానిక పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. క్రైస్తవులు, పాస్టర్లు గ్రామంలో ప్రధాన వీధులు తిరుగుతూ కీస్తు గీతాలను ఆలపిస్తూ ఏసుక్రీస్తు పునరుద్ధానాన్ని వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మైలవరం: మైలవరంలో మెస్సయ్య చర్చి ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. క్రీస్తు గీతా పాడుతూ క్రైస్తవులు ర్యాలీలో పాల్గొన్నారు. దైవ సేవకులు మణిబాబు, అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీలో మాట్లాడుతున్న పాస్టర్ ఎలీషా తదితరులు



మైలవరంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవులు

వైఎస్సార్‌ సీపీ నాయకుల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన తిరువూరు నియోజకవర్గ నాయకులు

తిరువూరు: ఇటీవల సంస్థాగత పదవుల్లో నియమితులైన వైఎస్సార్‌ సీపీ నాయకులు శనివారం విజయవాడ ఎం కన్వెన్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట మండలాల పార్టీ అధ్యక్షులు తాళ్లూరి నవీన్‌కుమార్, కావూరి వినయ్‌కుమార్, ఓలేటి దుర్గారావు, జిల్లా కార్యవర్గంలో పదవులు పొందిన పరసా శ్రీనివాసరావు, కంచర్ల ముత్యప్రసాద్, పల్లెపాము లక్ష్మయ్య, యరమల రామచంద్రారెడ్డి, కంచర్ల జయరాజు, చావా వెంకటేశ్వరరావు, చెరుకు నరసారెడ్డి తదితరులు జిల్లా పార్టీ అధ్యక్షుడు దేవినేని అవినాష్, కృష్ణా, గుంటూరు జిల్లాల రీజియన్ కో–ఆర్డినేటర వైవీ సుబ్బారెడ్డి, తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



ఆగిరిపల్లి బస్టాండ్ వద్ద రోడ్డును శుభ్రం చేస్తున్న మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి: ప్రతి ఒక్కరూ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంత్రి కొలుసు పార్థసారథి సూచించారు. శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక బస్టాండ్‌లో వ్యర్థాలను తొలగించి ప్రజలకు అవగాహన కల్పించారు. మంత్రి మాట్లాడుతూ రోడ్లపై చెత్త, వ్యర్థాలు పడవేయకుండా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ముసునూరు మండలంలోని గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు జరిగాయి.

- **విస్సన్నపేట:** పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ విస్సన్నపేటలో ప్రదర్శన నిర్వహించారు. ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, ఎంపీడీఓ చిన్న రాటాలు, వైద్యాధికారి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- **తిరువూరు:** పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని ప్రజలు స్వచ్ఛందంగా నిరోధించాలని తిరువూరు రెవెన్యూ డివిజినల్ అధికారి కె. మాధురి అన్నారు. గంపలగూడెం మండలం పెదకొమెర సర్కిల్‌లో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాలతో అనర్థాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు, కప్పులు, గ్లాసులను వినియోగించవద్దన్నారు. గంపలగూడెం ఎంపీడీఓ నాగేశ్వరరావు, తహసీల్దారు రాజకుమారి పాల్గొన్నారు.
- **ఇబ్రహీంపట్నం:** మండలం పరిధి గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర..స్వర్ణాంధ్ర కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని ఎంపీడీఓ సునీత శర్మ తెలిపారు. గుంటుపల్లి గ్రామ పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, ఇతర అధికారులతో కలిసి ఆమె పాల్గొన్నారు.
- **తిరువూరు:** స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తిరువూరు పట్టణ ప్రధాన రహదారిలో మురుగు కాలువలను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శుభ్రంచేశారు. నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అయ్యప్ప దేవాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు కార్యక్రమం జరిగింది.

ఆరోగ్యవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

మైలవరం: స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం ద్వారా గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా పంచాయతీల అధికారి లావణ్యకుమారి అన్నారు. మైలవరం ఎస్వీఎస్ కల్యాణ మండపంలో గ్రామ పంచాయతీ, వెలుగు కార్యాలయం ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర పై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతి బాబు మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ అబ్దుల్ ధారియా, సర్పంచ్ మంజుభార్గవి, తదితరులు పాల్గొన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో, చంద్రాల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలు జరిగాయి.

జేఈఈలో తిరువూరు విద్యార్థుల ప్రతిభ

తిరువూరు: జాతీయ స్థాయిలో ఇంజినీరింగ్, ఆర్కిటెక్ట్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షలో తిరువూరు పట్టణంలోని ముగ్గురు విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. నాగార్జున జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థిని గంటల దీక్షిత 95.49 శాతం మార్కులు సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ శేషగిరిరావు తెలిపారు. శ్రీనిధి జూనియర్ కళాశాల విద్యార్థి అజ్మీర వెనీల్ 86 శాతం, అజ్మీర కార్తీక్ 88.55 శాతం మార్కులు సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయా కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు అభినందించారు.

ఎస్ఆర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి ఎస్ఆర్ కళాశాల విద్యార్థి గారపాటి తేజ సత్యసాయి కుమార్ 1972వ ర్యాంక్, పోలవరపు రఘు 11,298 ర్యాంకు, మరో 13మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకులు సాధించి ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. ఎస్ఆర్ కళాశాలల జనరల్ మేనేజర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తమ కళాశాల విద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంకులు 22, 12 వేల లోపు 40 ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థులను అకడమిక్ డీన్ అరవింద్, జోనల్ ఇన్‌చార్జ్ కృష్ణారావు తదితరులు అభినందించారు.

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ప్రదర్శన



తిరువూరు: వక్ఫ్ చట్ట సవరణను నిరసిస్తూ గంపలగూడెంలో శనివారం ముస్లింలు ప్రదర్శన నిర్వహించారు. తోటమూల నుంచి గాంధీ సెంటర్ వరకు జరిగిన ప్రదర్శనలో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ముస్లిం మైనారిటీల హక్కులకు భంగం కలిగించే రీతిలో వక్ఫ్ చట్టాన్ని సవరించడం తగదని, వెంటనే ఈ సవరణ ఉపసంహరించకోవాలని కోరుతూ గంపలగూడెం తహసీల్దారు రాజకుమారికి వినతిపత్రం సమర్పించారు. వామపక్షాల నాయకులు వెంకటరెడ్డి, నాగుల్‌మీరా సంఘీభావం తెలిపారు.

వ్యర్థాలను యార్డుకు తరలించాలి

చాట్రాయి: భూమిలో కరగని వ్యర్థాలను తొలగిద్దామని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. శనివారం చాట్రాయిలో నిర్వహించిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఇంట్లో పనికి రాని వస్తువులను బయట పడేయకుండా డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. ఏఓ కమలవిష్ణు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ

నూజివీడు: మే నెల 10న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో సాధ్యమైనన్ని కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు అధికారులు, న్యాయవాదులు కృషి చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ అన్నారు. స్థానిక కోర్టు హాలులో శనివారం లోక్ అదాలత్ నిర్వహణ, కేసుల పరిష్కారం తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ రాజీకి వీలున్న అన్ని క్రిమినల్, సివిల్ కేసులతో పాటు బ్యాంకు రికవరీ కేసులు, ఎక్సైజ్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, మోటర్ వాహనాల ప్రమాద కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందడంతో పాటు డబ్బు, కాలం ఆదా అవుతుందన్నారు. సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదఖాసిం, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. వెంకటేశ్వరరావు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి, న్యాయవాదులు పాల్గొన్నారు.